

# ఎన్నారై ముచ్చట్లు

-సత్యం మందపాటి



(గతసంచిక తరువాయి)

## 11. టైము లేదు

“అమ్మాయికి అప్పుడే ఇరవై ఆరేళ్ళు వచ్చాయి. తెలిసిన నలుగురితోనూ చెప్పి, ఏదైనా మంచి సంబంధం వుందేమో చూడమంటే ఉలకరు. పలకరు. అసలేమిటి మీ ఉద్దేశ్యం?' పద్మావతి పదహారోసారి అడుగుతున్న ప్రశ్న.

“ఈమధ్య ఆఫీసులో పని విపరీతంగా ఎక్కువయిపోయింది. వేరే ఏం చేద్దామన్నా టైమ్ దొరకటం లేదు” ఆవిడ తాలూకు భర్త శ్రీనివాసుడి జవాబు. ఇది కూడా పదహారోసారే!

“కిచన్ సింక్ దగ్గర ఆరు నెలల నించీ నీళ్ళు లీకవుతున్నాయి. ఎన్నిసార్లు చెప్పినా ఇప్పటిదాకా మీరు పట్టించుకోలేదు. నీటి బిల్లు పెరిగిపోతున్నది” సరస్వతి అంది, సింక్ దగ్గర నీళ్ళు ఒక టవలుతో పిండుతూ.

“నాకు టైము లేదని చెప్పానా! ఆ పక్కింటాయన్ని అడగరాదూ?” అంటున్నాడు బ్రహ్మానందం, టీవీలో ఇండియా బాటింగ్ చూస్తూ. పక్కింటాయన కూడా, వాళ్ళింట్లో అదే బాటింగ్ చూస్తున్నాడు.

“అమ్మా, నాకు హోంవర్కులో సహాయం చేయవా?” అడుగుతున్నాడు గణపతి.

“వెధవా.. నీకు స్కూలుకి డబ్బులు, కోచింగుకి డబ్బులు కడుతున్నాం, వాళ్ళనడిగి ఆ హోంవర్కేదో చేసుకోరాదూ.. అసలే ఇన్ని పనులతో టైమ్ చాలక చస్తున్నాను” విసుక్కుంది పార్వతి.

“ఏమోయ్, అప్పారావ్! ఈమధ్య కనపడటం లేదు” ధర్మారావు అడుగుతున్నాడు తాపీగా.

“పండక్కి కూతురూ, అల్లుడూ వచ్చినప్పటినించీ ఒకటే బిజీ. అసలు మిగతా దేనికీ టైమ్ దొరకటం లేదు” అప్పారావ్ ఉవాచ.

“మధ్యాహ్నం పూట అలా పడి నిద్రపోకపోతే, అలా బజారెళ్ళి కాస్త కందిపప్పు, ఉప్పు తీసుకురాకూడదూ!” అడుగుతున్నది కుంభకర్ణారావుగారి భార్య.

“మా ప్రాజెక్ట్ మేనేజరుకి టైము లేక, ఈ ప్రాజెక్ట్ ఆలస్యమయిపోయింది. ఏం చేయమంటావు? ఇంకా బోలెడు పనుంది” సన్యాసి గడ్డంలా జుట్టు పెంచేసిన ప్రాజెక్ట్ మేనేజర్‌గారిని లాప్‌టాప్లో చూపిస్తూ అన్నాడు కుంభకర్ణారావు.

ం ం ం

ఇంతమంది కథలు చెప్పటం ఎందుకు. నా కథే చెబుతాను. నేను 1968నించే భారతదేశంలో కథలు వ్రాయటం మొదలుపెట్టాను. ఆనాటి ప్రముఖ పత్రికలు ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, యువ, జ్యోతి, ఆంధ్రజ్యోతి, ఆంధ్ర భూమి మొదలైన పత్రికలు నా కథలు ప్రచురించేవి. 1980 దశకం మొదట్లో అమెరికాకి వచ్చేశాం. ఇక్కడికి వచ్చినప్పటి నించీ,ఈ కొత్త సంస్కృతికి అలవాటు పడటం, ఉద్యోగంలో నిలదొక్కుకోటానికి కష్టపడి పని చేయటం, కొత్త జీవితంలోని మంచి చెడులకి తట్టుకోవటం, ఇండియాలో దగ్గరి వాళ్ళందరూ ఒక్కసారిగా దూరమైపోవటం, ఇలా కారణాలు ఏమయినా, నాకెంతో ప్రాణప్రదమైన నా రచనా వ్యాసాంగం, తెలుగు సాహిత్యం నాకు దూరమైంది. ఆరోజుల్లో ఇక్కడ చదవటానికి తెలుగు పుస్తకాలు దొరకకపోవటం ఇంకొక కారణం అయినా, టైము లేదు అనేది అన్నిటికన్నా పెద్ద కారణమయిపోయింది.

1982లో రిచర్డ్ అట్టిన్బరో తీసిన ‘గాంధి’ సినిమా చూసి నా స్పందనని ‘అమెరికాలో గాంధీ’ అనే వ్యాసం వ్రాసి పంపిస్తే, ఆనాటి సంపాదకులు వీరజీగారు ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురించారు. ఆయనప్పుడు నా అడ్రస్ కనుక్కుని ఆయనా, ఒకరిద్దరు సంపాదకులు ఒక కొత్త కథ వ్రాసి పంపమని అడిగి, నా దగ్గరనించీ ఏమీ సమాధానం రాకపోవటంతో ఇహ వూరుకున్నారు. ఆ రోజుల్లోనే రెండుసార్లు ఇండియా వెళ్ళినప్పుడు, పలకరిద్దామని కొంతమంది సంపాదకులని కలిస్తే, వారు కూడా అదే అడిగారు. అందరికీ నా జవాబు ఒకటే “వ్రాయటానికి టైము లేదు” అని. అలా 1990 దాకా నా రచనా వ్యాసాంగం దీర్ఘ నిద్రపోయింది.

1970 దశకంలో త్రివేండ్రంలో, నేను ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్లో పనిచేస్తున్నప్పుడు శాయిగారు నాకు మంచి స్నేహితులయారు. తర్వాత ఆయన శ్రీహరికోటకి వెళ్ళిపోవటంతో, నేను అమెరికాకి రావటంతో, మా స్నేహం కుసింత కుంటుపడింది.

1993లో అనుకుంటాను మిత్రులు శాయిగారు ‘రచన’ మాసపత్రిక నడుపుతూ, కొందరు మిత్రుల ద్వారా అమెరికాలో నా అడ్రస్ సంపాదించి, రచన పత్రికలు పంపించటం ప్రారంభించారు. ప్రతి పత్రికలోనూ ఒక చిన్న స్లిప్ మీద, ‘హౌ ఎబౌట్ ఎ స్టోరీ’ అని వ్రాసి పెట్టేవారు. అంతకన్నా ఒక్క ముక్క కూడా ఎక్కువ వ్రాసేవారు కాదు. అలా ఎన్ని నెలలు పంపించారో! పోస్టులో రచన పత్రిక వచ్చిన రోజే ఒక్క అక్షరం ముక్క కూడా వదలకుండా చదివే వాడిని. అవి చదువుతుంటే నాలో నేను వ్రాయలేకపోతున్నాననే అదోవిధమైన ఒక ఆవేదన కూడా వుండేది.

మళ్ళీ పెరుగుతున్న నా సాహిత్యాభిలాష చూసి, ఒకరోజు మా అమ్మాయి కూడా అడిగింది, “నువ్వు కథలు వ్రాయటం లేదేం నాన్నా!” అని.

మా ఆవిడ కూడా అందుకుంటూ, "అవును పూర్తిగా వ్రాయటం మానేశావేం? ఇదిగో ఆయన ఈనెల కూడా పట్టు వదలని విక్రమార్కుడిలా మళ్ళీ పుస్తకం పంపించారు. నువ్వు ధన్యవాదాలు చెప్పటం తప్ప, కదలవు మెదలవు. ఇండియాకి ఫోన్ చేసినప్పుడల్లా మా ఫ్రెండ్స్ అడుగుతున్నారు, నువ్వు కథలు ఎందుకు వ్రాయటం లేదని. నీ అభిమానులు కదా మరి!" అంటూ, ఆరోజే పోస్టులో వచ్చిన రచన పుస్తకం ఇచ్చింది.

అందులో మళ్ళీ 'హౌ ఎబౌట్ ఎ స్టోరీ' అని ఒక స్లిప్.

"నువ్వు వ్రాసే కథలన్నీ ఆకాశంలో కాక, నేల మీదే జరుగుతాయనీ, నీ చుట్టూ జరిగే విషయాల గురించే వ్రాస్తావనీ అనేవాళ్ళు అందరూ. ఆయన కూడా మన అమెరికా జీవితం మీద కథలు వ్రాయమనే ఆ స్లిప్పులు పెడుతున్నారేమో?" అంది శ్రీమతి.

అప్పుడే నా ఆలోచన ప్రారంభం అయింది.

అవును నేనెందుకు వ్రాయటం లేదు? నిజంగా టైమ్ లేదా? లేక అలా లేదని నన్ను నేనే మోసం చేసుకుంటున్నానా? నెలకొక్కసారి ఒక్క రోజు మూడు, నాలుగు గంటల సమయం వెచ్చించలేనా?

సమయం అనేది ఒక వస్తువు కాదు. అది బజారులో వాల్‌మార్టులోనో, ఏ సూపర్మార్కెట్లోనో దొరకదు. మరి టైమ్ దొరకటమేమిటి? అది ఎక్కడ దొరుకుతుంది?

ప్రపంచంలో ఎప్పుడూ, ఎక్కడయినా, ఎవరికైనా వారానికి ఏడు రోజులే, రోజుకి ఇరవై నాలుగు గంటలే, గంటకి అరవై నిమిషాలే! వాటిని సమర్థంగా వాడుకోవటం, వాడలేకపోవటం మనలోనే వుంది.

అమెరికాలో జీవితం బిజీగానే వుంటుంది. దానిలో అబద్ధం లేదు. కానీ తెలుగు భాషంటే నాకు వల్లమాలిన ప్రేమ. తెలుగు సాహిత్యం చదవటం అంటే నాకు ప్రాణం. వ్రాయటం నా ఊపిరి. మరి ఆ ఊపిరి ఆగిపోతే ఎలా?

ఆరోజునించీ సాహిత్యానికి నెలకి కొన్ని గంటలు కేటాయించటానికి ధృడనిశ్చయం తీసుకున్నాను. మా ఆవిడ ఎలాగూ అమెరికాలో భారతీయుల జీవితం గురించి వ్రాయమని కథాంశాన్నీ, పట్టువదలని విక్రమార్కుడి పేరుతో సహా సలహా ఇచ్చింది కనుక, నా ఆలోచనలకి ఒక రూపం వచ్చింది. అవే 'అమెరికా బేతాళుడి కథలు'. అమెరికాలో ఆనాటి తెలుగువారి జీవిత కథలు. రచన పత్రికలో ఒక సంవత్సరం పాటు ధారావాహికలా వచ్చాయి. 1995లో పుస్తక రూపంలో వచ్చాయి. అవి రెండుసార్లు, ఒక్కొక్కసారీ వెయ్యి కాపీల చెప్పున వాహినీ ప్రచురణల పేరుతో శాయిగారే ప్రచురిస్తే అన్నీ పూర్తిగా అమ్ముడుపోయాయి. నేను వ్రాసిన 'అమెరికా బేతాళుడి కథలు' అమెరికానించీ వెలువడిన తెలుగు డయాస్పొరా సాహిత్యంలో, ఒకే రచయిత వ్రాసిన మొట్టమొదటి కథల పుస్తకం. ఇప్పటికీ ఆ పుస్తకం కావాలి, ఎక్కడ దొరుకుతుంది అని ఎందరో అడుగుతున్నారు.

అప్పటినించీ, నేను రోజుకి పది గంటలు ఆఫీసులో పని చేస్తున్నా, కథలు వ్యాసాలు వ్రాస్తూనే వున్నాను. నాలోని రచయిత, "టైము లేదు" అని మళ్ళీ అనలేదు. నాలుగున్నర సంవత్సరాలు ఆంధ్రభూమి వారపత్రికలో వారం వారం (ఒక్క

వారం కూడా తప్పకుండా) ఎంతోమందికి ఎంతో నచ్చిన, నా ఎన్నారై కబుర్లు వచ్చాయి. అన్ని వ్యాసాలకు, నాకు ఒక్కొక్క దానికీ సమాచార సేకరణకు నాలుగైదు వారాలు పట్టినా, పాఠకుల దగ్గరనించీ వచ్చిన విశేష స్పందన ప్రేమతో భద్రంగా దాచుకున్నాను.

కొందరు "మీకు అంత సమయం ఎలా దొరికింది?" అని పత్రికా ముఖంగానూ, విద్యుల్లేఖల ద్వారానూ అడిగారు.

దానికి నా సమాధానం ఒక్కటే.

రోజుకి ఒక్క గంట ఆలస్యంగా నిద్రపోతే, సంవత్సరానికి 365 గంటల *'సమయం దొరుకుతుంది'.*

నేను శని, ఆదివారాలు మధ్యాహ్నం నిద్ర పోను. వారానికి నాలుగు గంటలు ఆదా. అంటే సంవత్సరానికి 208 గంటల *'సమయం దొరుకుతుంది'.*

రోజూ టీవీ చూడటం ఒక్క అరగంట తగ్గిస్తే, సంవత్సరానికి 182 గంటల *'సమయం దొరుకుతుంది'.*

ఇక్కడ విచిత్రం ఏమిటంటే, నాకు సమయం ఎక్కడా దొరకలేదు.

నేనే ఆ సమయాన్ని నాకిష్టమైన పనులు చేసుకోవటానికి దాచుకున్నాను.

టైము లేదు అనే నాలుగు అక్షరాల రెండు తెలుగు మాటలు మన నిఘంటువులోనించీ తీసేయాలి.

ఇక్కడ ఇంకొక ఉదాహరణ కూడా చెప్పటం చాల అవసరం.

అమెరికాలో రోజుకి పది గంటలు బీజీగా ఉద్యోగం చేస్తూ, ఎంతో శ్రమతో, ఏ లాభాపేక్ష లేకుండా ఒక అంతర్జాల మాసపత్రిక నడుపుతూ, ఇటు కొన్ని వందల మహానుభావుల జీవితలపై టాక్ షోలు చేస్తూ, అటు ఎన్నో రేడియో షోలు చేస్తూ, కుటుంబ పెద్దగా వారి పిల్లలకి విచక్షణా జ్ఞానం ఇవ్వటమే కాక, వారిసంక్షేమంలో తన భార్యకు సహాయపడుతూ, సమయం 'దొరకటం' అనేది ఒక అర్థం లేని మాట అని నిరూపించిన మనందరి మంచి స్నేహితుడు ఎవరో తెలుసా?

విశేష పాఠకాభిమానం పొంది, తెలుగు అంతర్జాల పత్రికల్లో ప్రథమ స్థానంలో నిలిచిన, ఇప్పుడు మీరు ఈ వ్యాసం చదువుతున్న ఈ 'కౌముది' అంతర్జాల అంతర్జాతీయ మాసపత్రిక నిర్వాహకులు, నాకు కొన్ని దశాబ్దాలుగా ఎంతో గొప్ప స్నేహితులు కిరణ్‌ప్రభగారు.

మీరు 'సమయం చేసుకుని' ఆయన్ని అడగండి, "మీకు సమయం ఎక్కడ దొరుకుతుంది?" అని!

సమయం అనేది వుండబట్టే ఎంతోమంది ఈ భూగోళం మీద మన జీవితాన్నిసుఖవంతం, విజ్ఞానవంతం చేశారు. చేస్తున్నారు.

ఐన్‌స్టైన్ సాపేక్ష సిద్ధాంతాన్ని కనుక్కున్నారు.

రైట్ బ్రదర్స్ విమానాన్ని కనుక్కున్నారు.

గాంధీగారు సౌత్ ఆఫ్రికాలో లాయర్ ఉద్యోగాన్నివదలి వచ్చేసి, ఇండియాకి స్వరాజ్యం తెచ్చిపెట్టారు.

బిల్ గేట్స్, స్టీవ్ జాబ్స్, రామానుజన్, భాభా, సారాభాయ్ మొదలైనవారు మన జీవనసరళినే మార్చేశారు.

కంప్యూటర్లు, సెల్ ఫోనులు, రాకెట్లూ, శాటిలైట్లూ… ఇలాటివి ఎన్నో కనిపెట్టారు.

మనందరి గురువుగారు, ముళ్ళపూడి వెంకటరమణగారు టైము గురించి ఇలా అంటారు:

"టైము అనగా కాలము. చాల విలువైనది. బజార్లో మనం మిరపకాయలు కొనగలం. చింతపండు కొనగలం. ఇడ్లీలు, కిడ్నీలు కొనగలం. గొడుగులు, గోంగూర కొనగలం. బాల్చీలు, లాల్చీలు కొనగలం. కానీ కాలాన్ని మాత్రం కొనలేం. కాలాన్ని వృధా చేయటం క్షమించరాని నేరం" అని.

ఆరోగ్యంగా బ్రతికితే మనది కనీసం తొంభై ఏళ్ల జీవితం. మనం కనిపెట్టిన కంప్యూటర్లు, సెల్ ఫోనులు నానో సెకండ్ల స్పీడులో ఎన్నో పనులు చేస్తుంటే, మరి వాటిని కనిపెట్టిన మనకి తొంభై ఏళ్ల జీవితం అంటే మాటలా!

అంతకన్నా ఎక్కువ సమయం మనకి నిజంగా అనవసరం. ఉన్న సమయాన్ని జాగ్రత్తగా వాడుకుంటే చాలు. ఎన్నో పనులు చేయవచ్చు. చాల మంచి పనులు చేయవచ్చు. ఎంతోమంది అభాగ్యులకు, నిర్భాగ్యులకు, పేదవారికి, వికలాంగులకు సహాయం చేయవచ్చు. ప్రపంచంలో చూడవలసిన ఎన్నో ప్రదేశాలు చూడవచ్చు. మంచి మంచి పుస్తకాలు కొన్ని వందలు చదవవచ్చు. అంతేకాదు మనకి ఇష్టమైనవి ఏమైనా, ఎన్నాయినా సరే, అవన్నీ చేయవచ్చు.

కాకపోతే మనం చేయవలసింది ఒకటి వున్నది.

మా చిన్నప్పుడు పరమాన్నం వడ్డిస్తున్నప్పుడు, 'కడుపు నిండా తిన్నాను, ఇక చోటులేదు' అంటే, మా పెద్దనాన్నగారు అనేవారు. 'పరమాన్నం మహారాజులాటిదిరా. అది వస్తుంటే అన్నీ తప్పుకుని దారినిస్తాయి. ఫరవాలేదు తిను' అని.

అలాగే మనకి ఇష్టమైన పనులు చేయాలనుకుని నిర్ణయించుకున్నప్పుడు, మిగతావన్నీ చిల్లర పనులుగా కనపడి, దారినిస్తాయి. ఇవ్వాలి.

అప్పుడు ఇక టైము లేదు అన్న ప్రశ్నే వుండదు. ఏమంటారు?

○ ○ ○

*(మరో ముచ్చట వచ్చే నెలలో)*

COMMENTS